# ★ ఇంటింట దీపావళి ★

గోపాలకృష్ణ

ఆ సంవత్సరం దీపావళి నెలాఖరున పడ్డది. అంటే రామారావువంటి రేషనాఫీసు గుమాస్తాలకు చాలా గడ్డురోజులన్న మాట. నెలకు వచ్చేజీతం నాలుగు, అయిదు తారీఖులలో పూర్తిచేసి కాళ్ళుజాచుకొనే రకం మన రామారావు. పెళ్ళవకముందు ఏదోకాస్త జల్సాగా తిరిగేవాడేమో! ముందు వెనుకలు చూడక ఖర్చుచేసి, యిబ్బందిపడినా లక్ష్యంచేయకుండా. కాని యిప్పుడో? భార్యఅంటూ ఒకతె ఉండబట్టి కొంచెంలో కొంచెం అన్నట్లు రెండు వారాలకేనా రేషనుసొమ్ము దాస్తున్నాడు. సాంప్రదాయానికి తగినట్లుగా రామానికి మగపిల్లవాడు. మొన్ననే నిండాయి పాపకి మూడేళ్లు.

రామారావుకు మతమన్నా, ఆచారాలన్నా, పండుగలన్నా పట్టింపులేదు. వాటిననుసరించడం కూడ యిష్టంలేదు. తానేదో గొప్పగా చదువుకోకపోయినా (స్కూలు ఫైనలుతో ముగించాడు), ప్రస్తుత కాలపు సమస్యలను, అభిప్రాయాలను అర్థం చేసుకునేవాడు. పెద్దసంస్కరణలకు పూనుకోకపోయినా, యింట్లోమాత్రం భార్యచేత మహాలక్ష్మీపీట తీయించాడు. మొక్కులు మానిపించాడు పతిభక్తికి పూర్వకాలపు టర్థం తప్పని భార్యకు బోధపరిచేవాడు. ఎలాగైనా తన యిల్లు కాస్త కొత్తతోవలు తొక్కి కొత్తదార్లు చూపాలని అతని కోర్కె.

మంగతాయారు రామారావుభార్య. భర్తవాక్యం దేవవాక్యంలా భావించే జాబితాలోనిది కాని కొన్నికొన్ని పనులు మాత్రం మానలేకపోయేది, యింకా పాతకాలంమనిషవటంచేత. కుర్రాడికి జబ్బుచేస్తే మహాలక్ష్మికి కొబ్బరికాయలు కొడతానని వెంటనే మొక్కుకుంది. మొన్న భోగిపండగకు పిల్లాడికి భోగిపళ్ళు పోసింది. ఆవేళ అసలు రామారావుకు తెలియనే తెలియదు. మధ్యాహ్నం మూడింటికల్లా పేరంటాళ్లు రావడం మొదలుపెట్టారు. ఏమంటే అబ్బాయికి భోగిపళ్లు పొయ్యడానికందితాయారు. పేరంటాళ్ళముందు ఏమీ అనలేక కిక్కురుమనకుండా పక్కగదిలో కూర్చున్నాడు రామారావు.

* * *

'పిల్లాడికి మూడుభోగిపళ్లేనా పొయ్యకపోతే ఎలాగండీ? మీరు మరీ విడ్డూరంగా చెబుతారు. కనకమ్మగారి లక్ష్మికి ఆరేళ్ళు నిండినా పొయ్యలేదూ? చిన్నప్పుడే సరదాలన్నీను.' అంది తాయారు పడుకునేటప్పుడు.

'పోనిద్దూ, నువ్వూ నీ సరదాలున్నూ. నేను చెప్పిందల్లా విన్నట్టే విని, మరోచెవిలోంచి వదిలేస్తావు. ఇహను గట్టి కట్టుబాట్లు చెయ్యాలి.' అన్నాడు రామారావు చిన్న కోపంతో.

'చెయ్యండీ. ఎన్ని కట్టుబాట్లేనా చెయ్యండి. మీతో చెప్పకుండా యింకేమీ చెయ్యను. ఏదో ముచ్చటగా ఉంటుందనీ......' అనితాయారంటుంటే, 'మూడేళ్లయినా నీముచ్చట తీరలేదూ?' అన్నాడు రామారావు కొంటెగా.

ఇల్లాగే విడిపోయి కలుస్తూండేవారు, రామారావుతాయార్లు. భార్యాభర్తా కలసినా వేరయినా పడకగదిలోనే.

* * *

యుద్ధం తరువాత దీపావళికి అంతా చాలా ఉత్సాహంగా ఉన్నారు. నల్లలైట్లు పోయాయి. చిచ్చుబుడ్లు, మతాబాలు, పటాసు కాయలు, సిసింద్రీలు యింకా ఏవో, ఏవో బజార్లో అమ్ముతున్నారు. పండుగ దగ్గరకొస్తే ప్రియమవుతాయని కొందరు ముందే కొంటున్నారు. కొందరు, అక్కడక్కడ, సామాన్లు కట్టే ప్రయత్నంలో ఉన్నారు. మరికొందరప్పుడే కొంటే, పిల్లలు కాల్చేస్తారని పండుగ రేపనగా కొందామని నిశ్చయించుకున్నారు. అక్కడక్కడ ఢాం, ఢూం శబ్దాలు, కాకరపువ్వొత్తులు పిల్లలు కాల్చడం మొదలయింది.

రామారావీ సరదాలోనే లేడు. దీపావళి తన ఇంట్లో జరపకూడదని చాలా పట్టుదలతో

ఉన్నాడు. కుర్రాడికి చొక్కా కూడ కుట్టించడానికి ఒప్పుకోలేదు. కాని తాయారు యిది ముందే గ్రహించి వెనక కుట్టించిన నాలుగు చొక్కాలలో రెండు దాచి ఉంచింది, పండుగలకు. ఇందులో రామారావు పట్టుదల సాగలేదు. 'సరే, యీరోజు పిండివంట వద్దన్నాడు.

*    *    *

'నేనువద్దంటూంటే ఎందుకుచేశావే బొబ్బట్లూ పులిహోరా? నువ్వు తింటే తిను గాని నాకు వద్దు' అని రామారావు వాటిని వేరే పెట్టబోయాడు భోజనం దగ్గిర.

'యెబ్బే! నేను చెయ్యలేదండీ. పొరుగింటావిడ రెండుబొబ్బట్లూ,పులిహోరా వద్దువద్దంటుంటే యిచ్చిపోయిందండీ. నేను యీ కూరా చారే చేశాను' అంది తాయారు.

కోపాన్ని మింగుకుని రామారావు బలవంతపు బ్రాహ్మణార్థంలాగ భోజనం ముగించాడు.

'కుర్రాడికి రెండగ్గి పెట్టెలు, కాకరపువ్వొత్తులేనా కొనియ్యరాదండీ, సరదాపడుతున్నాడు' అంది తాయారు భోజనాలయ్యాక.

'ఈ సరదాల కంతు లేనట్టుంది. మీ ఆచారాలు, మీ మతాలు నాకేమీ కిట్టవుసుమీ. వాడికికూడ యివి నేర్పకు. నేను వాడిని యీ వేళ బీచికి షికారు తీసుకుపోతాను' అన్నాడు రామారావు.

'అయ్యో! మీకు పుణ్యం ఉంటుంది. వాడి నింట్లో నేనా ఉండనియ్యండి. వచ్చీరాని జ్ఞానంతో వాడు మతాబా లడుగుతూంటే ఎలా ఊరుకోమంటారు? మీతో ఏది చెప్పినా యిలాగే' అని తాయారు మూతి ముడుపు మంత్రం ప్రయోగించింది.

'మనసు చంపుకొని కొందామంటే డబ్బా లేదు. మొన్న నే తెచ్చిన పదిరూపాయిలు అయిపోయినాయి. అందులో బాణసంచా కొంటానని ఎవరి నడగమంటావు?'

'పోనీ లెండి. మీకు యిష్టమయితే అప్పు దొరుకుతుంది. లేకపోతే దొరకదు. ఇంతకూ....' ఏదో అనబోయి తాయారు మొహం ప్రక్కకు తిప్పి కూర్చుంది.

ఇలాటి రంగాలు చాలా చూసిన రామారావు, సాయంత్రం యివన్నీ మరచి స్నేహితులతో బీచికి వెళ్ళాడు. అక్కడ రోజూలాగ పిల్ల లెవరూ ఆడుకోవడం లేదు. ఎవరో పెద్ద మనుషులుమాత్రం అక్కడక్కడ కూర్చున్నారు. సంధ్య పడేసరికి ఒక స్నేహితుడు: 'నేను వెళ్ళాలోయి, యింటికి' అని లేచాడు. అతడు వెళ్ళిన తరువాత రామారావు 'ఉత్త మధ్యయుగం వాడు మన పార్వతీశం. ఏదో పల్లెటూళ్ళో వుండవలసింది. లేకపోతే యింకా దీపావళీ సరదా ఏమిటి?' అన్నాడు. తక్కినవాళ్లు పక్కున నవ్వేరు. ఎందుకో తెలియకుండానే రామారావు కొంచెం వుడ్కేడు. కొంతసేపటికి అందరూ లేచి ఎవరిదారిని వాడు పడ్డారు. రామారావు, నటేశం టాకీహాలు ప్రక్కనుంచి వచ్చి శంకర విలాసు కాఫీ క్లబ్బుదగ్గరకు చేరారు.

'పోయి కాస్త టీ తాగుదాం పద' అన్నాడు నటేశం. ఇద్దరూ టీ తాగేరు. నటేశం పర్సుతీసి డబ్బిచ్చాడు. టీ తాగడం యిద్దరికీ హుషారు కలిగించింది.

'పదవోయి, యిప్పటినుంచీ ఏమి చేస్తావు. అలా తిరుగుదాం' అని నటేశం రామారావును ఒక వీధిలోకి తెచ్చాడు.

రామారావుకు అలా తిరగడం యిష్టంలేదు గాని తప్పలేదు. ఆ వీధిలో యిళ్ళన్నిటిలో ప్రమిదలు తోరణాల్లా వెలుగుతున్నాయి. 'దిబ్బు దిబ్బు దీపావళి' కొట్టడ మయినట్టుంది. పిల్లలు చాలా ఉత్సాహంగా కాలుస్తున్నారు. పెద్దవాళ్లు కాల్చి చూపిస్తున్నారు. పిల్లలు మతాబాలంటుకోగానే భయపడి వదిలేస్తున్నారు. పెద్దవారు వాటిని తీసి కాలుస్తూంటే సంతోషంతో చూస్తున్నారు. 'నేను పట్టుకుంటా'నని గెంతుతున్నారు; ఒకటి తరువాత ఒకటి చిచ్చుబుడ్లు వెలుగుతున్నాయి. పిల్లలు గంతు లేస్తున్నారు. ఒక అమ్మ కాకరపువ్వొత్తు కాల్చి చంటిపిల్ల చేతిలో పెట్టడానికి ప్రయత్నిస్తూంది. ఆ బిడ్డ భయంతో జంకుతూంది. మరోపిల్ల ధైర్యంగా కాల్చి అందరికీ చూపిస్తూంది. ఒక పధ్నాలుగేళ్ళ కన్య మతాబా కాల్చి తన తెల్లని ముఖాన్ని చూపించుకుంటూంది. మరొకరు తమ తెల్లనిపళ్ళను చూపిస్తున్నారు. అక్కడక్కడ

[illegible]రోడ్డు మధ్యకు వచ్చి తారాజువ్వలు వదులుతున్నారు. అందరూ పైకిచూస్తున్నారు, వాటిని చూడడానికి. చాలా చురుకుగా ఉంది దీపావళి. ఎవరి సరదాలు వారివి. ఒక తల్లి మూడేళ్ళ కుర్రాడిచేత మతాబా కాల్పిస్తూంది. పిల్లవాడు అతి ఓపికతో, సంతోషంతో కాలుస్తున్నాడు.

రామారావూ, నటేశం మరోవీధికి వచ్చారు. అక్కడా సంరంభం హెచ్చుగానేఉంది. అందుచేత యిద్దరూ మెయిన్‌రోడ్డు చేరారు. అక్కడ మాత్రం కాస్త అలికిడి తక్కువ. దూరదూరంగా కాలుస్తున్నారు. రామారావు యిదంతా చూసి చలించాడు. ఎంత ఆనందం ప్రజలకు దీపావళంటే! కాలుస్తున్నప్పుడు, చూస్తున్నప్పుడు పిల్లల అమాయికానందం అతణ్ని విహ్వలుణ్ని చేసింది. తా నెందుకంత కఠినంగా తనయింట్లో యిటువంటి ఆనందాలకు తా వియ్యలేదో తనే గుర్తించుకోలేకపోయాడు. అసలు యిలాటి ఆనందం ఉంటుందని యిదే మొదలుగా తెలియడం! ఈ ఆనందమయ ప్రపంచంలో,తన తాయారూ పాపాయిలే ఒంటరిగా, విచారంగా పడుకున్నట్లు కనిపించింది రామారావుకు. దీనంతటికీ తనేకదా బాధ్యుడు?

'ఏదీ,రెండురూపాయ లుంటే యియ్యవోయి నటేశం, పటాకీలు కొంటాను' అన్నాడు కొంచెం చలించిన గొంతుకతో రామారావు.

'పండుగెళ్లేక పటాకీ లెందుకోయ్? ఇంకా రోడ్డుమీదే చూద్దాం పద. లేకపోతే యింటికి పోదాం.' అన్నాడు నటేశం.

'నాకు కాదోయ్, పటాకీలు...మా పాపకి' అని రామారావు అనలేక అన్నాడు.

రామారావు మొహం జేగురు వారింది. అది గ్రహించి నటేశం వెంటనే అయిదురూపాయిల నోటు తీసి 'ఇదిగో నోయ్! ఆ మాట చెప్పేవు కావేమి, ఇంతకుముందే యిద్దును. ఇంత ఆలస్యం ఎందుకు చేశావు? వేగంగా కొని పట్టుకెళ్లు.' ఇద్దరూ ఒక మూసేస్తున్న సామాన్ల కొట్టు కెళ్లి యేదో సామాన్లుకొన్నారు. రామారావు ఆ సామాన్లుచూసి పిల్లవాడిలాగ సంతోషించాడు. పాతదంతా మరచిపోయాడు. నాలు గంగల్లో యిల్లు చేరాడు- అవి పాపకిద్దామని, కాలిపిద్దామని.

* * *

గుమ్మంలో తాయారు చెంగేసుకు పడుకొని వుంది రామారావు తెచ్చినవన్నీ చూపిస్తూ 'పాపాయేదీ' అని అడిగాడు. 'ఇప్పుడే పడుకోబెట్టాను. ఇవన్నీ యేమిటండోయ్ చాలా తెచ్చా'రంది తాయారు ఆశ్చర్యంగా. 'ఇవి మన పాపకేలే, లేపు పాపాయిని, కాల్పిద్దాం' అన్నాడు రామారావు ఆత్రుతతో. 'పక్కింటబ్బాయిచేత రెండగ్గిపెట్టెలు, ఒక కాకరపువ్వొత్తులపెట్టె, పెట్టడుగున డబ్బులుంటే, తెప్పించానండీ. వాళ్లబ్బాయి వీడి జట్టుంటానని ఒకమతాబాకూడాయిచ్చాడు. ఇప్పటివరకు కాల్చి పడుకున్నాడు, లేపుతే కలత నిద్దరవుతుందండీ.' అని తయారనేసరికి రామారావు తనేనా యీ ఆనందానికి నోచుకోని దని మనసులోనే వాపోయాడు.

---

ఆలుమగలు అబ్బాయిని తీసుకుని సినీమాకి వెళ్లారు. ఆట ఆరంభించిందో లేదో, అబ్బాయి సంగీతం మొదలుపెట్టాడు.

"కుర్రవాణ్ణి వూరుకోబెట్టలేకపోతే, సొమ్ము వాపసుచేసి పంపివేస్తా" మని సినీమా మేనేజరు బెదరించాడు.

దాంతో కుర్రవాడి గొంతు మళ్లీ వినపడలేదు. కాని ఫిల్ము ఏమీ బాగాలేదు. ఎంతకీ అయేటట్టు కనిపించలేదు.

"నీకు పుణ్యముంటుంది- కుర్రవాణ్ణి ఓ గిల్లు గిల్లుదూ" అన్నాడు భార్యతో భర్త.